## ప్రజల కష్టాలు తీర్చేందుకే పార్టీ కార్యాలయం

**మేడ్చల్‌రూరల్:** జిల్లాలోని ప్రజల కష్టాలు తీర్చడంతో పాటు, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూసేందుకే మేడ్చల్‌లో జిల్లా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్‌లో జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఓట్ల దొంగతనం జరిగిన తీరును ప్రజలకు వివరించేందుకు యువనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్టారని ఆయన యాత్రను స్ఫూర్తిగా తీసుకునే జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార రథాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. బాల్‌రెడ్డి, వేణుగోపాల్, సత్యనారాయణ, శంకర్‌ముదిరాజ్, రమణారెడ్డి, కౌడె మహేష్, సురేందర్ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**కీసర:** నాగారం మున్సిపల్ రాంపల్లికి చెందిన ఈగ లక్ష్మణ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును ఆదివారం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ కన్వీనర్ పొట్ట శ్రీశైలం, నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు విఘ్నేష్, సోమిరెడ్డి, బాలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డీజే ఆపరేటర్లతో సమీక్ష సమావేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు

**కీసర:** గణేష్ నవరాత్రుల్లో భాగంగా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలకు మండపాల్లో డీజే సిస్టమ్ వాడకూడదని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని స్పష్టం చేశారు. పోలీసులు, డీజే ఆపరేటర్లు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక కలయిక



శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

**కీసర:** నాగారం మున్సిపాలిటీ ప్రశాంత్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గం అధ్యక్షుడు ఎన్నికైన కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు ఆయనతో చర్చించారు.

## ఉచిత వైద్య శిబిరం




వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

**కీసర:** యువజన కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ బార్లపాటి ఆధ్వర్యంలో లైఫ్ లైన్ తులసి ఆస్పత్రి సహకారంతో ఆదివారం చీర్యాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి యువకులు, మహిళలు, పెద్దలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు రామారావు, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్, కీసర మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, సురేష్, అజయ్, శివరాంరెడ్డి, హన్మంత్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

**బోడుప్పల్:** ప్రజాప్రతినిధులు, నాయకులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ అన్నారు. 19వ డివిజన్‌లోని ఈస్ట్ బృందావన్‌కాలనీ పార్కు స్థలంలో డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్ కుమారుడు బొమ్మక్ సందేశ్ జ్ఞాపకార్థం రూ.10 లక్షలతో నిర్మించిన మండపాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహ్మారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్‌గౌడ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గణపయ్యా.. ఎలాగయ్యా?




- శివారుల్లో చందాలకు ముఖం చాటేస్తున్న నేతలు
- రియల్ జోరు తగ్గడంతో ఉత్సవాల్లో కనిపించని జోరు
- ఎన్నికలు లేకపోవడంతో కనిపించని నాయకులు

### రియల్ వ్యాపారం తగ్గడం..

నగర శివారు అంటేనే డబ్బులంటే లెక్కలేని నేతలు. కష్టం చూడకుండా కేవలం మాటలతో డబ్బులు సంపాదించే రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రస్తుతం స్తబ్దుగా ఉండటంతో ఆ ప్రభావం వినాయక చవితి పండగపై పడింది. యువత వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించడానికి ఆసక్తి ఎక్కువగా చూపడంతో ఏళ్లగా కొంతమంది నేతలు యువతలో తమ ఫాలోయింగ్ పెంచుకోవడానికి వారిని ప్రోత్సహిస్తూ.. మండపాల ఏర్పాటు, నిమజ్జనానికి సైతం రూ.లక్షల్లో విరాళాలు ఇచ్చేవారు. ప్రస్తుతం రియల్ వ్యాపారం పూర్తిగా తగ్గిపోవడంతో డబ్బు రోటేషన్ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో వినాయక నవరాత్రి ఉత్సవాలకు ప్రతీ ఏటా లక్ష రూపాయలు చందా ఇచ్చే దాత నేడు రూ.10 వేలు సైతం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. చాలామంది మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాల వైపే వెళ్లడం మానేశారు.

### మున్సిపాలిటీగా మారడంతో మారిన రాజకీయం

నగర శివార్లలో ఉన్న గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చడం, మున్సిపాలిటీలను గ్రేటర్ విలీనం చేయాలనే ప్రతిపాదనలు చేయడంతో శివార్లలో రాజకీయ శూన్యత ఏర్పడింది. గ్రామాలు, మున్సిపాలిటీ వార్డులు ఉన్న సమయంలో సర్పంచ్, వార్డు సభ్యుడు, ఎంపీటీసీ, సహకార సంఘం డైరెక్టర్, వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసే అవకాశం ఉండటంతో ఆశావాహులు ఎక్కువగా ఉండటం, పార్టీల నాయకుల హడావుడి ఉండేది.

– ప్రస్తుతం అన్ని పోస్టులు లేకపోవడం, ఉన్న కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు.. ? ఉంటాయో స్పష్టత లేకపోవడం, మున్సిపాలిటీలున్నా.. వాటికి ఖచ్చితంగా ఎన్నికలు ఉంటాయనే స్పష్టత లేకపోవడంతో శివారు ప్రాంతాల్లో నేతలు రాజకీయం మానుకుని అవకాశం వచ్చినప్పుడు చూద్దాంలే.. అనే ఆలోచనలో స్థానిక నాయకులున్నారు.

### ఖర్చులు తగ్గించుకునే యోచన

స్థానిక నేతలకు పదవులు పొందే అవకాశాలు సన్నగిల్లడంతో పండగలు, యువకుల పేరుతో డబ్బులు ఎందుకు వృథా చేసుకోవడం, వినాయకుడికి మన ఇంట్లో పూజలు చేసుకుందాం లే.. ! అనవసరంగా పేరు కోసం పోయి డబ్బులు ఎందుకు ఖర్చు చేయడం వంటి ఆలోచనలతో ముఖాలు చాటేస్తున్నారని వినికిడి.

### లడ్డూ వేలం డబ్బులకు ఇబ్బందులే..

గతంలో రాజకీయాలు వేడిగా ఉన్నప్పుడు నాయకులు, రియల్ వ్యాపారులు తమకు సంబంధం ఉన్నా.. లేకపోయినా పేరు, గొప్పల కోసం వినాయక మండపాల వద్దకు వెళ్లి లడ్డూ వేలంలో వినాయకుడి లడ్డూను లక్షల్లో పాడి దక్కించుకునే వారు. వేలం పాటలో పొందిన లడ్డూ డబ్బులు మరుసటి ఏడాది పండగ నాటికి ఇచ్చే అవకాశం ఉండటంతో ఆ ప్రభావం ప్రస్తుత ఏడాదిపై పడింది.

### భవిష్యత్తు ఎలా.. ?

గతంలో యువకులు పోటీలు పడి వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గతంలో డబ్బులు విరాళంగా అధికంగా రావడం, యువకుల వెనుక ఉన్న వారు అవతలివారిపై పోటీ పడి ఖర్చుకు వెనుకడుగు వేయకుండా ఉత్సవాలు నిర్వహించే వారు. ప్రస్తుతం చందాల రాబడి పూర్తిగా తగ్గిపోవడంతో తమ పరువు పోకుండా నిర్వాహకులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అపసోపాలు పడుతున్నారు. మొత్తం మీద నగర శివార్లలో పండగపై రియల్ ఎస్టేట్ ప్రభావం , రాజకీయ స్తబ్దత స్పష్టంగా కనిపిస్తోంది.

## ఆకట్టుకున్న 'ఫ్లేవర్స్ ఆఫ్ ది వరల్డ్–2025'



**పోచారం:** యంనంపేట్‌లోని రాక్ ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'ఫ్లేవర్స్ ఆఫ్ ది వరల్డ్ 2025' పేరుతో ఫుడ్ ఫెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన విభిన్న ఆహార వంటకాలు నోరూరించాయి. అందంగా అలంకరించిన స్టాళ్లపై రుచికరమైన వంటకాలను ప్రదర్శించారు. సందర్శకులు ఆహార పదార్థాలను ఆరగించి ఆనందం వ్యక్తం చేశారు.

## ఐక్యతతో సమస్యల పరిష్కారం



విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న నాయకులు

**మల్కాజిగిరి:** బ్రాహ్మణులు ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కరించుకోగల్గుతామని, బ్రాహ్మణ ఐక్యవేదిక కో– ఆర్డినేటర్లు ఆంజనేయ ప్రసాద్‌శర్మ, రుద్రవీణ బాలకృష్ణ అన్నారు. ఆదివారం ఆనంద్‌బాగ్‌లోని లలితాపరమేశ్వరి ఆలయ కమ్యూనిటీహాల్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో బ్రాహ్మణ భవన్ కోసం భూ కేటాయింపు చేయడానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారన్నారు. మిగతా ప్రజాప్రతినిధులను కూడా మద్దతుగా కలుస్తామన్నారు. బ్రాహ్మణ సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు పలకాలని విస్తృత భాగస్వామ్యం పెంచడానికి నియోజకవర్గంలోని 9 డివిజన్లలో సబ్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. రఘుకిరణ్, రామకృష్ణ, తులసీరమణాచార్యులు, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌టీయూ నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

**మల్లాపూర్:** మల్లాపూర్ ట్యాక్సీ సెక్టార్ బీఆర్‌టీయూ నూతన కమిటీని ఆదివారం బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నగేష్‌కుమార్, పంజా రాజుయాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పీఆర్.ప్రవీణ్, హమాలీ శ్రీనివాస్, అధ్యక్షులుగా రాంపల్లి మహేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మేడి శివారెడ్డి, బొడిగే రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా భూపతి అశోక్, మర్రిపెద్ది అశోక్‌గౌడ్, కోశాధికారిగా వెంకటేష్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తిరుపతి, నాగరాజు, రమేష్, కిషోర్, మోహన్, రాముగౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి కొంపల్లి రవిలను ఎన్నుకున్నారు. అనంతరం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వారిని సత్కరించారు.

## అలరించిన నృత్య ప్రదర్శన




ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

**ఉప్పల్:** ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. జర్మనీ నుంచి వచ్చిన కళాకారులు మాస్టర్ శంకర్ శ్రీపతి పండతారాధ్యులు వయోలిన్‌పై వర్ణం, రామకృతి, కష్టనీ బెగానే అంశాలను పలికించారు. అనన్య శ్రీపతి పండితారాధ్యుల భరతనాట్య ప్రదర్శనలో గణపతి కౌతం, రాజరాజేశ్వరి అష్టకం, తిల్లాన, తదితర అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

## అర్చక సంఘాల్లో బీసీలకు పెద్దపీట

**హబ్సిగూడ:** అర్చక సంఘాల్లో బీసీ వర్గాలకు పెద్దపీట వేశామని తెలంగాణ అర్చక సమాఖ్య నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ గంగ ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. సంఘాల్లో బీసీలకు పెద్దపీట వేశామని, తెలంగాణ అర్చక సమస్యల పరిష్కారానికి అనేక న్యాయ పోరాటాలు చేసినట్లు పేర్కొన్నారు. పోరాటాల ఫలితంగానే దూప దీప నైవేద్య పథకం అమలులోకి వచ్చిందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు, ఆనంద్ శర్మ, శ్రీనివాసాచార్యులు, నారాయణ, శ్రీనివాస్, సుదర్శన్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఐజీ సర్వ సభ్య సమావేశం

**పోచారం:** ఎల్‌ఐజీ టౌన్‌షిప్ సర్వ సభ్య సమావేశం ఆదివారం జరిగింది. పోచారంలోని ఎల్‌ఐజీ కాలనీలో ఫ్లాట్ల నిర్మాణ విస్తీర్ణాన్ని పెంచేందుకు హౌసింగ్ బోర్డు అధికారులతో చర్చించాలని సమావేశంలో సభ్యులు నిర్ణయించారు. బ్లాకుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించేందుకు సభ్యులు అంగీకారం తెలిపారు. నెలవారీ నిర్వహణ చార్జీలను రూ. 200 నుంచి రూ.300లకు పెంచాలని తీర్మానించారు. అనధికారికగా కొంతమంది వ్యక్తులు మెయింటెనెన్స్ వసూలు చేస్తున్నారని, వీరిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కొందరు సభ్యులు కోరారు. దీనిపై అసోసియేషన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

## ఎంపీ ఈటల పరామర్శ



**రామంతాపూర్:** గోఖలేనగర్‌లో గత ఆదివారం రాత్రి జరిగిన దుర్ఘటనలో మృతిచెందిన రామంతాపూర్, హబ్సిగూడ వాసులు కృష్ణయాదవ్, సురేష్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రుద్ర వికాస్ కుటుంబాలను ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారంతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేలా కృషి చేస్తానని, వారికి హామీ ఇచ్చారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణితో పాటు యాదవసంఘం ప్రతినిధులు సర్వబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

**మేడ్చల్‌రూరల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఆదివారం మేడ్చల్ పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఆదివారం డీవైఎఫ్ఐ జిల్లా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలని, జాబ్ కేలండర్ ప్రకటించి నోటిఫికేషన్లు వేసి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడిగా మన్నె ప్రశాంత్, కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా జ్యోతి, కిరణ్, సహాయ కార్యదర్శులుగా నర్సింగ్‌రావు, నాగరాజు, ట్రెజరర్ చైతన్యరెడ్డి, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## నిరసన తెలిపే హక్కులను కాలరాయడం సరికాదు

**జవహర్‌నగర్:** ప్రజాస్వామ్యంలో ప్రజలు నిరసన తెలిపే హక్కులను కాలరాయడం సరికాదని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. వరంగల్ సభను తెలంగాణ ప్రభుత్వం భగ్నం చేయడాన్ని నిరసిస్తూ.. ఆదివాసీల హక్కుల నేతలు ఇచ్చిన పిలుపులో భాగంగా జవహర్‌నగర్‌లో పీఓడబ్ల్యూ (విముక్తి) నాయకులు చుక్క కళ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదికను విజయవంతం చేయాలని, గత నెలరోజులుగా అన్ని ఏర్పాట్లు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం సభకు అనుమతి లేదని చెప్పడం సరికాదన్నారు. షేక్ షావలి, సావిత్రి, మహ్మద్ రషీద్, సునీత తదితరులున్నారు.

## అంబేడ్కర్ కృషితోనే రాజ్యాంగ ఫలాలు



**ఘట్‌కేసర్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి బీపీ మండల్‌కు నిజమైన నివాళులర్పించాలని మర్పల్లిగూడ అరుంధతి యువజన సంఘం మాజీ అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం వల్లే బహుజనులు సామాజిక, ఆర్థికంగా ఎదుగుతున్నారని, బడుగు, బలహీన వర్గాలు జాతిపిత అంబేడ్కర్ అని కొడియాడారు. నర్సింగ్‌రావు, రాందాసు, నారాయణ, రాజేష్ కుమార్, రవి, వంశీ, నిఖిల్, వికాస్, ఉపేందర్, ముఖేష్, లలిత్ పాల్గొన్నారు.

## నల్ల చెరువు 'బేబీ పాండ్' సందర్శన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ పద్మజ, ఏసీపీ చక్రపాణి తదితరులు

**ఉప్పల్:** పండుగ సమీపిస్తున్న కొద్ది వినాయక పండగ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. ఆదివారం ఉప్పల్ నల్ల చెరువు వద్ద నిర్మించిన బేబీ పాండ్‌ను మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి ఏసీపీ చక్రపాణితో కలిసి పరిశీలించారు. అప్పటికే కొలనులో ఉన్న మురుగు నీటిని జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించడం ప్రారంభించారు. కొలను వద్ద భద్రత, సౌకర్యాలపై డీసీపీ ఆరా తీశారు. అనంతరం దేవేందర్‌నగర్ డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసే కృత్రిమ పాండ్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్సై మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక హంగులతో ముదిరాజ్ భవన్



అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్:** అసంపూర్తిగా ఉన్న ఉప్పల్ ముదిరాజ్ భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మించి, అన్ని రకాల వసతులు కల్పిస్తామని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ముదిరాజ్ సంఘం ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఆమె వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని, ఆధునిక హంగులతో సాధ్యమైనంత త్వరలో నిర్మాణం పూర్తి చేయించి, అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

**కుషాయిగూడ:** ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని చర్లపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఓ వృద్ధుడు విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వృద్ధుడిని పరిశీలించగా.. అప్పటికే అతడు మృతిచెందాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు సుమారు 60–65 ఏళ్ల ఉంటాడని, గత పది రోజులుగా చర్లపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేసుకుంటూ ఉండేవాడని పోలీసులు తెలిపారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, ఆకలి, ఆరోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం

- నేడు మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా
- ఆరు గ్యారంటీలు.. డబుల్ బెడ్రూం, పెన్షన్లకు ఆందోళన

**సాక్షి,మేడ్చల్ జిల్లా:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా.. ఇప్పటివరకు ఆరు గ్యారంటీల అమలుకు నోచుకోలేదని సీపీఎం జిల్లా కమిటీ నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చింది. పేదలకు ఇళ్లు, పెన్షన్లు ఇవ్వడంతో పాటు తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తుంది. కలెక్టరేట్ ఎదుట ఉదయం 11గంటలకు జరిగే ధర్నాలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వేస్లీ, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొననున్నారు.

### 1,275 దరఖాస్తులే పరిష్కారం..

మేడ్చల్ జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా నాయకత్వం కృషి చేస్తుంది. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజా పాలన కార్యక్రమంలో 1.42 లక్షల దరఖాస్తులు రాగా.. వీటిలో మొదటి దశ కింద 308 ఇళ్లు, రెండో దశలో 967, మొత్తం 1,275 మంజూరు చేసినట్లు సీపీఎం చెబుతోంది.

☛ జీహెచ్ఎంసీతో సహా శివారు ప్రాంతాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లలో మూడు దశలలో 61,884 ఇళ్లు కేటాయించగా.. మిగిలినవి 38,116 ఇళ్లు ఇంకా కేటాయింపులు చేయలేదన్నారు. వెంటనే అర్హులైన పేదలకు కేటాయించాలని సీపీఎం డిమాండ్ చేస్తోంది. మురారిపల్లి, రాంపల్లి, అహ్మద్‌గూడ, దుండిగల్, నిజాంపేట్ తదితర ప్రాంతాల్లో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీ సముదాయాల్లో తాగు నీరు, విద్యుత్, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సత్వరమే అన్ని వసతుల కల్పనకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి వెంటనే పరిష్కరించాలని కోరుతోంది.

### ఆరు గ్యారంటీలపై..

కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో తాత్సర్యం చేస్తోందని సీపీఎం విమర్శిస్తోంది. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డులు, గృహజ్యోతి, మహాలక్ష్మి తదితర పథకాల కోసం 9.2 లక్షల మంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం ఆరోపించారు.

☛ దివ్యాంగులకు రూ.3,016 నుంచి రూ. 6,000, ఇతర పెన్షన్లు రూ.2,016 నుంచి రూ.4,000లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు నెలకు రూ.2,500లు, నిరుద్యోగ భృతి నెలకు రూ.4000లతో సహా కల్యాణలక్ష్మి నగదుతో పాటు తులం బంగారం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని, వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

### విద్య, వైద్యంపై నిర్లక్ష్యం..

జిల్లాలో 15 మండలాలు ఉండగా.. ఐదు మండలాల్లోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయని, మిగతా 10 మండలాల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.

☛ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని, జిల్లాలోని అల్వాల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి (టిమ్స్) నిర్మాణాన్ని తక్షణమే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం డిమాండ్ చేస్తోంది.

☛ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, డాక్టర్లు , సిబ్బందిని నియమించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలను తక్షణమే విడుదల చేసి, పెంచిన రూ. 15 లక్షల పరిమితి మేరకు అన్ని ఆసుపత్రుల్లో ప్రజలకు వైద్యం అందించేలా చూడాలి.

☛ జిల్లాలో ఉప్పల్–నారపల్లి ఫ్లై ఓవర్ ఎలివేటెడ్ కారిడార్, బోయిన్‌పల్లి–మేడ్చల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు సత్వరమే పూర్తి చేయాలని సీపీఎం కోరింది. మల్కాజిగిరి, వాజ్‌పేయినగర్, ఆర్కేపురం, బొల్లారం ఆర్‌ఓబీ, పనులు చేపట్టి, చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు రవాణా సౌకర్యాలు మెరుగుపరిచి, ఎంఎంటీఎస్ రైళ్లను సికింద్రాబాద్ నుంచి చర్లపల్లికి ఎక్కువ సంఖ్యలో నడపాలని సీపీఎం జిల్లా కమిటీ కోరుతోంది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387